సాక్షి నిర్మల్

బుధవారం ၊ 30 ၊ ఏప్రిల్ ၊ 2025



విహారం.. వినోదం

ఉమ్మడి ఆదిలాబాద్ ప్రకృతి సంపదకు నిలయం. ఆధ్యాత్మిక, చారిత్రక, పర్యాటక ప్రాంతాలెన్నో ఉండగా.. సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. IIలో ▸



వేసవి దుక్కులతో ప్రయోజనం

వేసవిలో దుక్కులు దున్నితే నిద్రావస్థలో ఉన్న పంటలను ఆశించే పురుగులు పక్షులకు ఆహారంగా మారుతాయి. భూమి సారవంతంగా మారుతుంది. IIIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 41.0 /27.0

ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం చిన్నపాటి వాన కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

పనుల పురోగతిపై సమీక్ష



మాట్లాడుతున్న డీఈవో రామారావు

లక్ష్మణచాంద: మండలంలో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనుల పురోగతిపై డీఈవో రామారావు మంగళవారం మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. ముందుగా పాఠశాలల్లో ఇప్పటివరకు చేపట్టిన, చేపట్టాల్సిన పనుల వివరాలు తెలుసుకున్నారు. మండలంలోని ఒడ్డెపెల్లి, బోరిగాం పాఠశాలల్లో సంబంధిత హెచ్‌ఎంలు, చైర్మన్లు పెండింగ్ పనులను రెండురోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంఈవో అశోక్ వర్మ, పీఆర్ ఏఈ సంజయ్, జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు రాజేశ్వర్, లింబాద్రి, చైర్మన్లు, సీఆర్పీ సుధాకర్ పాల్గొన్నారు.

కడెం: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరగా పూర్తి చేయాలని డీఈవో రామారావు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని ఆయా పాఠశాల ల హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించి పనుల పురోగతి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఈవో షేక్ హుస్సేన్, పీఆర్ ఏఈ సూర్యతేజ తదితరులున్నారు.

రేపు భైంసాలో ప్రజావాణి

భైంసాటౌన్: పట్టణంలోని పాత రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలోగల ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఎస్పీ జానకీ షర్మిల పోలీస్ ప్రజావాణి నిర్వహించనున్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కార్యాలయంలో అందుబాటులో ఉండి సబ్ డివిజన్‌పరిధిలోని బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. భరోసా కేంద్రంలో కూడా సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటారు.

డ్రగ్స్ రవాణా చేస్తే చర్యలు

నర్సాపూర్ (జి): మాదక ద్రవ్యాలు అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా కఠినచర్యలు తప్పవని నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా హెచ్చరించారు. సోమవారం రాత్రి నర్సాపూర్ (జి), చాక్‌పల్లి, తిమ్మాపూర్ (జి) గ్రామాల్లోని అనుమానితుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగిస్తే కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ, నర్సాపూర్ (జి), దిలావర్‌పూర్, సారంగపూర్, నిర్మల్ రూరల్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్లీబర్డ్‌కు స్పందన అంతంతే

భైంసాటౌన్: ఎర్లీబర్డ్ స్కీం కింద మున్సిపాలిటీల్లో గతంలో బకాయిలు లేనివారు ఈ ఆర్థికసంవత్సరం ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లిస్తే పురపాలకశాఖ 5శాతం రాయితీ ఇస్తోంది. నేటితో చెల్లింపు గడువు ముగియనుండగా జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో స్పందన అంతంత మాత్రంగానే ఉంది. నిర్మల్ మున్సిపాలిటీలో డిమాండ్ రూ.12.7కోట్లు ఉండగా రూ.1.26 కోట్లు వసూలు చేశారు. భైంసాలో డిమాండ్ రూ.5.11 కోట్లుండగా రూ.40 లక్షలు, ఖానాపూర్‌లో డిమాండ్ రూ.2.13 కోట్లుండగా రూ.9 లక్షలు వసూలయ్యాయి.

నూతన నియామకం



భూమయ్య

నిర్మల్‌టౌన్: అఖిలభారత ఆదివాసీ వికాస్ పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా వెంకగారి భూమయ్యను నియమించినట్లు జాతీయ అధ్యక్షుడు చెందాల లింగయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన జిల్లా, రాష్ట్ర, జాతీయ నాయకులకు ఈ సందర్భంగా భూమయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఆదివాసీ సమస్యలపై మరిన్ని పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు.

'పది' ఫలితాల్లో జిల్లా హ్యాట్రిక్ కొట్టేనా?

నిర్మల్‌ఖిల్లా: నేడు పదోతరగతి పరీక్షా ఫలితాలు విడుదల కానున్నాయి. పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా వరుసగా రెండేళ్లు మొదటి స్థానంలో నిలుస్తూ వస్తోంది. ఈసారి కూడా అదే స్థానాన్ని పదిలపర్చుకుని హ్యాట్రిక్ కొట్టేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రణాళికా బద్ధంగా వారిని సన్నద్ధం చేశారు. జిల్లా నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో మొత్తం 9,129 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 4,685 బాలికలు 4,444 మంది బాలురున్నారు. జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో 47 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. గత మార్చి 21 నుంచి ఏప్రిల్ 2వరకు అధికారులు పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు.

మైనర్ డ్రైవింగ్ డేంజర్

'ఏం సార్.. మొన్న మీబాబు మెయిన్‌రోడ్డుపై బైక్ నడుపుతున్నాడు. ఇప్పుడింకా టెన్త్ క్లాసే కదా సార్.. ఇప్పటి నుంచే అలా బండి నడపడం అవసరమంటారా..!?' అని ప్రవీణ్ అంటుండగానే.. 'అరె ఏం సార్.. మీరింకా ఏ జమానాలో ఉన్నారు. ఇప్పుడంతా స్మార్ట్‌ఫోన్ల జమానా నడుస్తుంది. పిల్లలు అన్నిట్లో ఫాస్ట్ ఉండాలి. అన్ని నేర్చుకోవాలి. ఏజ్‌ది ఏముంది సార్..!? వాడికి బైక్ బాగానే వస్తుంది. ఈమధ్య ఏ పని ఉన్నా.. వాడికే చెబుతున్నాం కూడా..' అంటూ శ్రీనివాస్ చెబుతూ ఉండటంతో ప్రవీణ్ సైలెంట్ అయిపోయాడు. సరిగ్గా వారం తర్వాత.. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి దగ్గర శ్రీనివాస్ కనిపించడంతో ప్రవీణ్ 'ఏమైందంటూ..' పలకరించాడు. తన బాబు బైక్ నడుపుతూ ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీకొట్టాడని, దీంతో తన కొడుకు ఎడమకాలు విరగడంతో పాటు వెనుక కూర్చున్న పిల్లాడికీ తీవ్రగాయాలయ్యాయని చెబుతూ, వాడికి బైక్ ఇచ్చినందుకు తనపైనా పోలీసు కేసు నమోదైందని తలదించుకున్నాడు. –నిర్మల్

- గాలిలో కలుస్తున్న చిరు ప్రాణాలు
- పోలీసుల హెచ్చరికలు బేఖాతరు
- జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహణ
- మైనర్లు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

స్పెషల్ డ్రైవ్‌లో పట్టుకున్న వాహనాలు

ఠాణా	వాహనాలు	ఠాణా	వాహనాలు
నిర్మల్ టౌన్	10	తానూరు	6
భైంసా టౌన్	10	దస్తురాబాద్	4
నిర్మల్ రూరల్	5	కడెం	4
భైంసా రూరల్	4	పెంబి	1
ఖానాపూర్	6	దిలావర్‌పూర్	3
కుభీర్	3	నర్సాపూర్	3
కుంటాల	6	సారంగపూర్	7
బాసర	5	లక్ష్మణచాంద	6
లోకేశ్వరం	7	మామడ	2
ముథోల్	4	సోన్	4



నిర్మల్‌టౌన్: తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

పిల్లలకు వాహనాలిస్తే కేసులు

నిర్మల్‌టౌన్: మైనర్లకు వాహనాలిచ్చే ఓనర్లపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ జానకీ షర్మిల హెచ్చరించారు. ఆదివారం జిల్లాలోని అన్ని ఠాణాల పరిధిలో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టుబడిన మైనర్ల తల్లిదండ్రులకు రెండో విడతగా మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ప్రొజెక్టర్ ద్వారా షార్ట్ ఫిలింస్, మైనర్ డ్రైవింగ్ కారణంగా జరిగిన ప్రమాదాల వీడియోలు చూపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వాహనాలు నడిపే మైనర్లపై కేసులు నమోదు చేస్తే వారు భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటారని, ఎట్టి పరిస్థితుల్లోనే వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేంద్రరెడ్డి, ఆర్‌ఐలు రాంనిరంజన్, శేఖర్, రమేశ్, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణాలు పోయిన ఘటనలెన్నో..

ఇదొక్కటే కాదు.. ఇలాంటివెన్నో ఈమధ్య చోటుచేసుకుంటున్నాయి. కొన్ని ఘటనల్లో ప్రాణాలూ పోయాయి. శ్రీనివాస్‌లాంటి తల్లిదండ్రులు తమ పిల్లలకు అన్నీ నేర్పాలన్న అత్యాశలో వయసుకు మించిన సాహసాలు, తప్పిదాలనూ చేయిస్తున్నారు. తమ కొడుకు/బిడ్డ చిన్నవయసులోనే డ్రైవింగ్ చేస్తుండటం చూసి మురిసిపోతున్నారు. కానీ.. వారి వయసురీత్యా ఉండే మానసికస్థాయికి అది సరికాదన్న విషయాన్ని విస్మరిస్తున్నారు. ఈక్రమంలోనే తమ చేతులారా.. తమ పిల్లల ప్రాణాలు, ఎదుటివారి జీవితాలతోనూ ఆడుకుంటున్నారు. దీనిపైనే ఇటీవల పోలీస్‌శాఖ సీరియస్‌గా దృష్టి పెట్టింది. జిల్లాలో ఒకేరోజు వందకేసులు నమోదు చేసింది. చిన్నవయసులో డ్రైవింగ్ సరికాదని మానసిక వైద్యనిపుణులూ హెచ్చరిస్తున్నారు.

రెండేళ్ల క్రితం ఇలా..

రెండేళ్లక్రితం జిల్లాకేంద్రంలోనే ఓ పేరున్న బిల్డర్ బిడ్డ (మైనర్) కారు నడుపుతూ మంచిర్యాలరోడ్డులో బైక్‌పై వెళ్తున్నవారిని ఢీకొట్టింది. ఇద్దరికి గాయాలయ్యాయి. అక్కడున్న వారందరూ 'ఏంటమ్మా.. ఇంత చిన్నవయసులో కారు నడుపుతున్నావ్.. అది కూడా ఇంత స్పీడ్‌గా..' అని ప్రశ్నిస్తే.. 'మా నాన్నే నాకు నేర్పించారు. కారు కూడా ఆయనే ఇచ్చారు. మీరెవరు నన్ను అడగడానికి..' అంటూ ఎదురు ప్రశ్నించింది. దీంతో అక్కడున్నవారు సదరు బిల్డర్‌కు ఫోన్ చేసి మందలించారు.

పిల్లల డ్రైవింగ్.. పెద్దలపై కేసులు

18 ఏళ్లున్నవారే డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి అర్హులు. లేనిపక్షంలో పిల్లలు వాహనాలు నడిపిస్తే.. సంబంధిత వాహన యజమానిపైనా చట్టపరంగా చర్యలు తీసుకుంటారు. మోటారు వాహనాల చట్టం సెక్షన్ 199ఏ ప్రకారం బాలల డ్రైవింగ్‌పై కేసుల నమోదు ఉంటుంది. ఇటీవల జిల్లాలో పోలీసులు మైనర్ డ్రైవింగ్‌పై సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు. సదరు పిల్లలతో పాటు తల్లిదండ్రులనూ స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. కేసుల నమోదు, జరిమానాలు వసూలు చేస్తున్నారు. ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సుమారు 296 మంది మైనర్లు పోలీసులకు పట్టుబడగా 100 మందిపై కేసులు నమోదయ్యాయి. అనంతరం మైనర్ల తల్లిదండ్రులకు మోటార్ వాహన చట్టాలపై అవగాహన కల్పించారు.

అవగాహన కల్పిస్తున్నాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాం. వాహనాలు నడుపుతున్న మైనర్లను గుర్తిస్తున్నాం. పిల్లలతోపాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ఇది నిరంతర ప్రక్రియగా సాగుతుంది.

– జానకీషర్మిల, ఎస్పీ

18 ఏళ్లు నిండితేనే డ్రైవింగ్



మనకున్న నిబంధనల ప్రకారం 18ఏళ్లు ఉంటేనే డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవచ్చు. డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనాన్ని నడిపించాలి. లేనిపక్షంలో వాహనాలు నడిపితే చట్టప్రకారం వారిపై చర్యలు ఉంటాయి. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలివ్వొద్దు.

– పీ దుర్గాప్రసాద్, జిల్లా రవాణాశాఖ అధికారి

మానసిక సామర్థ్యం తక్కువ



మైనర్లకు మానసిక సామర్థ్యం తక్కువ. వాహనాలను నడిపేటప్పుడు క్షణాల్లో నిర్ణయాలు తీసుకోలేక ప్రమాదాల బారిన పడుతుంటారు. మైనర్లకు వాహనాలిస్తే వారిని ప్రమాదంలోకి నెట్టినట్లే తల్లిదండ్రులు భావించాలి.

– సురేశ్ అల్లాడి, సైకియాట్రిస్ట్

పార్టీ బలోపేతమే లక్ష్యం

- జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో పీసీసీ అబ్జర్వర్లు చంద్రశేఖర్‌గౌడ్, అవేజ్



మాట్లాడుతున్న పీసీసీ అబ్జర్వర్ చంద్రశేఖర్‌గౌడ్, వేదికపై అవేజ్, శ్రీహరిరావు, ఐకే రెడ్డి, నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యమని పీసీసీ అబ్జర్వర్లు, చంద్రశేఖర్‌గౌడ్, అవేజ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మారుతి ఇన్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా రెండు నిమిషాలు మౌనం పాటించి పహల్గాం మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కష్టకాలంలో పార్టీ వెన్నంటి ఉన్న నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని తెలిపారు. పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణను ఓర్వలేక బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు సోషల్ మీడియా ద్వారా విషప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. మే 4నుంచి 10వరకు బూత్ స్థాయి సమావేశాలు, మే 13 నుంచి 20వరకు మండల స్థాయి సమావేశాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ముడుసు సత్యనారాయణ అనే పార్టీ కార్యకర్త ఎస్సీ నాయకులను వేదికపైకి పిలవలేదని ఆరోపించారు. దీంతో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు కలగజేసుకుని వేదికపై ఎస్సీ నాయకులు ఉండగా అనవసర రాద్ధాంతం చేయకూడదని సముదాయించారు. కాంగ్రెస్ క్రమశిక్షణ గల పార్టీ అని, అనవసర ఆరోపణలు చేస్తే చర్యలు తీసుకుంటామని పీసీసీ అబ్జర్వర్లు హెచ్చరించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వద్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త పనిచేయాలని, స్థానిక ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచారి, మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, నారాయణరావు పటేల్, రేఖానాయక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ హాజరయ్యారు.

పని చేసేవారికే పదవులు

పార్టీ కోసం పని చేసినవారికే పదవులు దక్కుతాయని పీసీసీ అబ్జర్వర్ చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మారుతి ఇన్ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయలేని అనేక పనులు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నట్లు చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుంటామని చెప్పారు. జిల్లా స్థాయి సమావేశంలో ఎస్సీలకు సముచిత స్థానం కేటాయించలేదని కార్యకర్త సత్యనారాయణ చేసిన ఆరోపణలను ఖండించారు. పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గాభవాని మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో 2014 నుంచి ఎస్సీ మహిళనే జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కొనసాగుతుందని చెప్పారు. కాంగ్రెస్ మహిళలకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. పీసీసీ పరిశీలకుడు అవేజ్, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచారి, మాజీ మంత్రి ఐకే రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, నారాయణరావు పటేల్ ఉన్నారు.

పనులు చేయకున్నా కూలి కాజేశారు!



అక్రమాలపై సిబ్బందిని వివరణ కోరుతున్న అధికారులు

సారంగపూర్: మండల కేంద్రంలో మంగళవారం ఇన్‌చార్జి డీఆర్డీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. జనవరి 1, 2024నుంచి మార్చి 3, 2025వరకు మండలవ్యాప్తంగా అవెన్యూ ప్లాంటేషన్, పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలు చనిపోయిన వి షయం, నష్టాన్ని తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. మహవీర్‌తండాలో అధిక మస్టర్లు వేసి దాదాపు రూ.4 లక్షలు కూలీలు, మేట్ పంచుకున్నట్లు తెలిపారు. దీనిని కూలీలు రాతపూర్వకంగా అంగీకరించగా, అధికారులు మళ్లీ విచారణకు ఆదేశించారు. తనిఖీ బృందం సభ్యులు నిరాకరించి ఇద్దరు మేట్‌లను తొలగిస్తున్నట్లు ప్రకటించారు. దుర్గానగర్‌లోనూ ఇలాంటి అక్రమాలు జరిగినట్లు వెల్లడించారు. మహవీర్‌తండాకు చెందిన ఒకే కుటుంబానికి మూడు జాబ్‌కార్డులు జారీ చేసి 236రోజుల పని కల్పించిన విషయమై ఇన్‌చార్జి డీఆర్డీవో మేట్, ఫీల్డ్ అసిస్టెంట్లను వివరణ కోరగా, గమనించలేదని బదులిచ్చారు. మహవీర్ తండా, దుర్గానగర్‌లో తల్లిదండ్రుల పేరిట మైనర్లతో పనులు చేయించినట్లు బృందం సభ్యులు వెల్లడించగా, మేట్‌పై అధికారులు ఆగ్రహం వ్యక్తంజేశారు. ఏపీడీ నాగవర్ధన్, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావు, ఫిర్యాదుల పరిష్కార అధికారి నవీన్, ఎంపీవో అజీజ్‌ఖాన్, ఏపీవో లక్ష్మారెడ్డి, ఎస్టీఎం దత్తు, ఎస్‌ఆర్‌పీలు సాంబశివాచారి, కార్యదర్శులు పాల్గొన్నారు.

నాన్న కల నెరవేర్చా..

- మూడో ప్రయత్నంలో ఐఏఎస్ సాధించా..
- ఆత్మవిశ్వాసంతో సాగితే లక్ష్యసాధన సులువే
- ట్రైయినీ కలెక్టర్ సలోని చాబ్రా మనోగతం



సలోని చాబ్రా, ట్రైయినీ కలెక్టర్

కైలాస్‌నగర్: 'నన్ను కలెక్టర్‌గా చూడాలనేది మా నాన్న కోరిక.. దాన్ని ఎలాగైనా నెరవేర్చాలని పాఠశాల స్థాయిలోనే నిర్ణయించుకున్నా.. ఆయన అందించిన ప్రోత్సాహంతో ముందుకు సాగా.. రెండుసార్లు విఫలమయ్యా.. అయినా నిరాశ చెందలేదు.. రాత్రింబవళ్లు మరింత కష్టపడి చదివా.. లోటుపాట్లు సవరించుకుని ముందడుగు వేశాను. మూడో ప్రయత్నంలో విజయం సాధించా.. 2023 యూపీఎస్సీ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 29వ ర్యాంకు సాధించా.. ఐఏఎస్‌గా తెలంగాణ క్యాడర్‌కు ఎంపికయ్యా.. నాన్న కల నెరవేర్చడం నాకెంతో ఆనందాన్నిచ్చింది.. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను అమలు చేసి, పేదలకు సేవ చేయడమే లక్ష్యమని అంటున్నారు ఆదిలాబాద్ జిల్లాకు నూతనంగా విచ్చేసిన ట్రైయినీ కలెక్టర్ సలోని చాబ్రా. 'సాక్షి'కి మంగళవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు విషయాలు వెల్లడించారు.

సాక్షి: 'గుడ్ మార్నింగ్ మేడమ్.. వెల్‌కమ్ టు ఆదిలాబాద్. ట్రైయినీ కలెక్టర్‌గా జిల్లాకు విచ్చేసిన మీకు మరోసారి ప్రత్యేక అభినందనలు. మీ కుటుంబ నేపథ్యం వివరాలు..

ట్రైయినీ కలెక్టర్: మాది హర్యానా రాష్ట్రంలోని గురుగ్రాం. నాన్న ఇంద్రజిత్, అమ్మ సీమ. ఇద్దరూ గురుగ్రాంలోనే బిజినెస్ చేస్తుంటారు. అన్న దక్ష్. గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. ఊరిలోనే అమ్మనాన్నలకు తోడుగా ఉంటూ వ్యాపారం చూసుకుంటారు.

సాక్షి: మీ విద్యాభ్యాసం ఎక్కడెక్కడ సాగింది..

ట్రైయినీ కలెక్టర్: ఒకటి నుంచి ఇంటర్మీడియెట్ వరకు గురుగ్రాంలోని బ్లూ బెల్స్‌లో చదివా. చిన్నతనం నుంచే చదువులో ముందుండేదాన్ని. స్కూల్‌లో నిర్వహించే డిబేట్‌లు, ఎక్స్‌ట్రా కరిక్యులమ్‌లో పాల్గొంటూ ప్రతిభ కనబర్చుతుండేది. చదువులో ఎప్పుడూ ముందుండే నేను టెన్త్, ఇంటర్‌లో ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యా. అనంతరం ఢిల్లీలోని శ్రీరాం కాలేజ్ ఆఫ్ కామర్స్ యూనివర్సిటీలో బీఏ ఆనర్స్ ఎకానామిక్స్ పూర్తి చేశాను. ఆ వెంటనే సివిల్స్ పరీక్షలపై దృష్టి సారించాను.

సాక్షి: యూపీఎస్సీ కోచింగ్ ఎక్కడ తీసుకున్నారు.. ఎన్నోసారి విజయం సాధించారు..

ట్రైయినీ కలెక్టర్: పదో తరగతిలోనే ఐఏఎస్ సాధించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నా. ఆ దిశగా అడుగులు వేశాను. ఢిల్లీలోని కోచింగ్ సెంటర్‌లో ఏడాది పాటు శిక్షణ పొందాను. ఆప్షనల్ సబ్జెక్ట్‌గా సోషియాలజీని ఎంచుకున్నా. ప్రణాళికాబద్ధంగా చదివా. 2021లో తొలిసారి యూపీఎస్సీ పరీక్షలకు హాజరయ్యా. ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. అయితే కొద్దిపాటి తేడాతో విజయం సాధించలేకపోయాను. మరో ప్రయత్నంలో ప్రిలిమ్స్‌లోనే ఆగిపోయాను. అయినా ఏమాత్రం నిరాశ చెందలేదు. మూడో ప్రయత్నం 2023లో జాతీయస్థాయిలో 29వ ర్యాంకు సాధించాను. ఐఏఎస్ కావాలనే నా సంకల్పంతో పాటు నాన్న కలను నెరవేర్చాను. తెలంగాణ క్యాడర్‌కు ఎంపికై ప్రస్తుతం ట్రైనింగ్ నిమిత్తం ఆదిలాబాద్‌కు రావడం జరిగింది. ఏడాది పాటు జిల్లాలో పనిచేయాల్సి ఉంటుంది. రెండు సార్లు విఫలమైన సమయంలో నేను ఆత్మవిశ్వాసం కోల్పోకుండా అమ్మనాన్నలు అండగా నిలిచారు. వెన్నుతట్టారు. వారందించిన ప్రోత్సాహంతోనే విజయం సాధించాను.

సాక్షి: సివిల్స్, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు మీరిచ్చే సలహా..

ట్రైయినీ కలెక్టర్: సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమయ్యే అభ్యర్థుల్లో చాలా మంది ఒకటి, రెండు ప్రయత్నాలకే నిరాశకు లోనవుతారు. ఇక మా వల్ల కాదంటూ వెనుకడుగు వేస్తుంటారు. అపజయాలను చూసి నిరాశ చెందొద్దు. సంకల్పం వీడకుండా ముందడుగు వేయాలి. పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా చదివితే తప్పకుండా విజయం సాధించవచ్చు. రోజుకు కనీసం 8 నుంచి 10 గంటలు చదవాలి. ముఖ్యంగా సెల్‌ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి. ప్రతిరోజు పత్రికలను చదవడం అలవాటు చేసుకోవాలి. వర్తమాన అంశాలపై పట్టు సాధించాలి. గత ప్రశ్నాపత్రాలను విశ్లేషించుకోవాలి. సందేహాలుంటే ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలి. ఆత్మవిశ్వాసం, సంకల్పబలంతో ప్రయత్నిస్తే తప్పకుండా లక్ష్యాన్ని సాధించవచ్చు.

'భూభారతి రైతులకు వరం'



అందాకూర్‌లో మాట్లాడుతున్న అభిలాష అభినవ్

కుంటాల: భూభారతి పథకం రైతులకు వరం లాంటిదని కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అందాకూర్ గ్రామంలో రైతులకు భూభారతి చట్టంపై అవగాహన కల్పించారు. ఆధార్ లాగే భూధార్ ద్వారా నంబర్ ఇచ్చి భూమి, హద్దులు గుర్తించేందుకు వీలుంటుందని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్ మాట్లాడుతూ.. మే 1నుంచి గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కమల్‌సింగ్, ఎంపీడీవో లింబాద్రి, డీటీ నరేశ్‌గౌడ్, ఏవో విక్రమ్, ఎంపీవో రహీంఖాన్, ఆర్‌ఐలు అడెల్లు, రాజేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

సోన్: మండల కేంద్రంలోని రైతువేదికలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించగా కలెక్టర్ అభిలాష అభినవ్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. భూభారతి చట్టం, గ్రామ రెవెన్యూ అధికారుల నియామకంతో భూసమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని తెలిపారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి గోవింద్, తహసీల్దార్ మల్లేశ్, ఎంపీడీవో సురేశ్, ఎంపీవో కలీం, ఏవో వినోద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కుభీర్: భూభారతి చట్టం కింద భూసమస్యలన్నీ తహసీల్దార్ కార్యాలయంలోనే పరిష్కారమవుతాయని కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. కుభీర్‌లో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. గతంలో సాదాబైనామా కోసం దరఖాస్తు చేసుకున్నవారికి ఈ చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, స్పెషలాఫీసర్ శంకర్, తహసీల్దార్ శివరాజ్, ఏవో సారిక, ఎంపీడీవో నవనీత్‌కుమార్ తదితరులున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



పతకాలు సాధించిన జిల్లాకు చెందిన వుషూ క్రీడాకారులు

భైంసాటౌన్: అమెచ్యూర్ వుషూ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిరిసిల్లలో ఇటీవల నిర్వహించిన మూడో సబ్ జూనియర్, జూనియర్, రెండో సీనియర్ రాష్ట్రస్థాయి వుషూ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. జిల్లాతోపాటు ఖేలో ఇండియా శిక్షణ కేంద్రం నుంచి 26 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 11 బంగారు, ఆరు రజత, నాలుగు కాంస్య పతకాలు సాధించినట్లు ఖేలో ఇండియా కోచ్ జ్ఞానతేజ తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో నర్వాడే రుద్ర, అబ్దుల్ రెహమాన్, ఎం.శ్రేయాన్ కార్తికేయ, వాగ్మారే కరణ్, రాథోడ్ కృష్ణ, రూప భాదూర్, తోకల్వాడ్ అరవింద్, జాదవ్ ఆర్యన్ బంగారు పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. జూనియర్ విభాగంలో రాంచరణ్, హర్షవర్ధన్ శర్మ, సీనియర్ విభాగంలో కొట్టె స్వరూప బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. వీరు మే, జూన్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు రిటైర్డ్ టీచర్లకు సన్మానం

నిర్మల్ రూరల్: జిల్లాలో బుధవారం రిటైర్డ్ కానున్న 11మంది ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో సన్మానించనున్నట్లు డీఈవో రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కార్యాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు హాజరుకావాలని సూచించారు.

క్లుప్తంగా

కలప పట్టివేత


అధికారులు పట్టుకున్న కలప

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని సీతానగర్ గ్రామ సమీపంలోని గొల్లగూడలో మంగళవారం ఫారెస్టు అధికారులు దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన కలపను పట్టుకున్నారు. కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్ రేంజ్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన ఈదాడిలో సుమారు రూ.5 లక్షల విలువ గల కలపను స్వాధీనం చేసుకున్నట్లు కాగజ్‌నగర్ ఫారెస్టు రేంజ్ అధికారి అనిల్ కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో డీఆర్‌వోలు బాబు పటేకర్, ఎఫ్ఎస్ వోలు జగన్, కామరాజ్, మనోహర్, అస్మా, ఎఫ్‌బీవోలు మనోహర్, గిరిబాబు, శ్రీవాణి, వాణి అరవింద, బేస్‌క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఒకరి అరెస్ట్

భైంసాటౌన్: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసినట్లు సీఐ గోపీనాథ్ తెలిపారు. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా మాలేగాంకు చెందిన ముజమ్మిల్ హుస్సేన్‌కు భైంసాకు చెందిన మహిళతో వివాహం కాగా కొద్దిరోజులుగా పట్టణంలోని ఓవైసీనగర్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో మహారాష్ట్ర నుంచి గంజాయి తెచ్చి స్థానికంగా విక్రయిస్తున్నాడు. తమకు అందిన సమాచారం మేరకు మంగళవారం భోకర్ చౌరస్తాలో పోలీసు, రెవెన్యూ, జిల్లా క్లూస్‌టీం ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 1.140 కేజీల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇద్దరి బైండోవర్

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్‌పేట్‌లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని మంగళవారం బైండోవర్ చేసినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. విశ్వనాథ్‌పేట్‌లోని ఓ పాన్‌షాప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన షేక్ కమర్, షేక్ సోహెల్ గంజాయి విక్రయిస్తుండగా పట్టుకుని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

ఇద్దరి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసు స్టేషన్ పరిధిలోని న్యూహౌజింగ్ బోర్డు కాలనీలో ఈనెల 22న చోరీకి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. రణదీవెనగర్‌కు చెందిన కిరణ్, బాలియా, గాంధీనగర్‌కు చెందిన సమీర్‌ఖాన్‌లు రాత్రి సమయంలో ఇంట్లో చొరబడి తులంనర బంగారం, ఓ టీవీ, లెనోవో ట్యాప్‌టాప్, ఫోన్ అపహరించగా వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గతనెల ఎంప్లాయీస్ కాలనీలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడి 13 తులాల వెండి, 0.5 గ్రాముల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల సీజ్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని పెన్‌గంగ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను మంగళవారం సీజ్ చేసినట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. వాహనాల యజమానులు శ్రీనివాస్, పోతురాజు, ముకున్, సాంబశివ, వెంకటస్వామి, డ్రైవర్లు లక్ష్మన్న, ఆకాష్ కాలే, బుచ్చన్న, బాలాజీ, గోవింద, బాలాజీపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఎస్సై పురుషోత్తం పాల్గొన్నారు.


విహారం.. వినోదం

- ప్రకృతి సంపదకు నిలయం ఉమ్మడి ఆదిలాబాద్
- ఆధ్యాత్మిక ప్రాంతాలూ అనేకం..
- పర్యాటకులను ఆకర్షిస్తున్న జంగల్ సఫారీ


జన్నారం అటవీ డివిజన్‌లో చుక్కల దుప్పులు

ఓ వైపు పచ్చని అటవీ ప్రాంతాలు, వన్యప్రాణులు.. మరోవైపు పురాతన ఆలయాలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యాటకులను ఆకర్షిస్తోంది. అడవి దున్నలు, చిరుతలతో పాటు జింకలు, నీలుగాయిలు ఇతర వన్యప్రాణులకు నిలయంగా కవ్వాల్ అభయారణ్యం నిలుస్తోంది. గిరిజన పోరాట స్ఫూర్తిని తెలిపే కుమురంభీం స్మారకం, జైన శిల్పకళతో నిర్మించిన శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయం, పాండవులు వనవాసం చేసిన పెద్దయ్య దేవుడి గుట్ట, గోదావరి ఒడ్డున వెలిసిన సత్యదేవుని ఆలయం, బాసరలోని సరస్వతీ అమ్మవారి ఆలయం పర్యాటకంగా కీలకమైన ప్రాంతాలు. వేసవి సెలవుల్లో ఉమ్మడి జిల్లాలో సందర్శించాల్సిన ముఖ్యమైన ప్రాంతాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

పుణ్యక్షేత్రాల గూడెం..


గుట్టపై సత్యదేవుని ఆలయం


దండేపల్లి: మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం గుట్టలు పుణ్యక్షేత్రాలకు నిలయంగా మారాయి. గుట్టపై వెలసిన సత్యనారాయణ స్వామి ఆలయం తెలంగాణలోనే ప్రసిద్ధి గాంచింది. 1964లో గూడెం గ్రామ వాస్తవ్యుడు గోవర్దన పెరుమాండ్ల స్వామి అనే దాదాత్త వైష్ణవుడు ఆలయాన్ని నిర్మించాడు. ఆలయ సమీపంలోనే పవిత్ర గోదావరి నది ప్రవహిస్తుంది. ఆలయానికి సమీపంలో ఉన్న మరో ఎత్తయిన కొండపై అయ్యప్ప, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాలు ఉన్నాయి. గుట్ట కింద షిర్డి సాయినాథుని ఆలయం ఉంది. ఇలా ఒకే చోటా ఇన్ని ఆలయాలు ఉండటంతో గూడెం గ్రామం పుణ్య క్షేత్రాలకు నిలయంగా మారింది. సత్యదేవుని ఆలయంలో ప్రతీ పౌర్ణమికి జాతర నిర్వహిస్తారు. మంచిర్యాల నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల ద్వారా నేరుగా రావచ్చు.

దట్టమైన అడవిలో పెద్దయ్య ఆలయం


పెద్దయ్య కొండ

దండేపల్లి: మంచిర్యాల జిల్లా దండేపల్లి మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవిలో రెండు గుట్టల నడుమ గలగలా పారే సెలయేరు ఒడ్డున పెద్దయ్యదేవుని ఆలయం ఉంది. ద్వాపర యుగంలో ఇక్కడ పాండవులు వనవాసం చేశారని పూర్వీకులు చెబుతుంటారు. ప్రతీ గురు, ఆదివారాల్లో ఇక్కడ జాతర జరుగుతుంది. జిల్లాతో పాటు కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. ఇక్కడ గిరిజనులే పూజారులు. ప్రతీ ఖరీఫ్, రబీ సీజన్ల ప్రారంభంలో రైతులు పెద్దయ్య దేవున్ని దర్శించుకోవడం ఆనవాయితీ. ఆలయానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో వస్తుంటారు.

పచ్చదనానికి కేరాఫ్ కవ్వాల్


కవ్వాల్ టైగర్‌జోన్

జన్నారం: దట్టమైన అడవులు, పచ్చదనం పంచుతున్న చెట్లు, స్వచ్ఛమైన ప్రాణవాయువుకు కేరాఫ్‌గా కవ్వాల్ టైగర్‌జోన్‌కు పేరుంది. 982 చదరపు కిలోమీటర్ల కోర్ ఏరియా, 1123 చదరపు కిలోమీటర్ల బఫర్ ఏరియాలో విస్తరించి ఉంది. పక్షుల కిలకిలలు, వన్యప్రాణుల పరుగులు, వాగుల గలగలలు ఇవన్నీ కలగలిపిన సంపదే కవ్వాల్ టైగర్‌జోన్. దీనికి గుండెకాయ జన్నారం అటవీ డివిజన్.

సఫారీ ప్రయాణం

పర్యాటకులను అడవిలో తిప్పేందుకు అటవీ శాఖ, పర్యాటక శాఖలు సఫారీల ను ఏర్పాటు చేశాయి. అటవీశాఖ ఆధ్వర్యంలో ఐదు లగ్జరీ సఫారీలు, పర్యాటకశాఖ ఆధ్వర్యంలో రెండు సఫారీలను ఏ ర్పాటు చేశారు. పర్యటక శాఖ ఏర్పాటు చేసిన రిసార్ట్స్‌లో రాత్రి బసచేసి, ఉదయాన్నే అడవిలో సఫారీ ప్రయాణం చేస్తారు. ఉదయం 7 నుంచి 10 గంటలకు, 10 నుంచి ఒంటిగంట వరకు, సాయంత్రం 4 గంటల నుంచి అడవిలో సుమారు 15 కి లోమీటర్ల దూరం సఫారీ ప్రయాణం ఉంటుంది. వన్యప్రాణుల పరుగులు, పక్షుల కిలకిలలు నేరుగా చూడవచ్చు. పచ్చదనం పంచుకున్న అడవి అందాలు పర్యాటకులను ఆకట్టుకుంటాయి. హరిత రిసార్ట్‌లో పర్యాటకుల కోసం కాటేజీలను ఏ ర్పాటు చేశారు.

ఇలా వెళ్లాలి..

మంచిర్యాల నుంచి గంటకో బస్సు ఉంటుంది. మంచిర్యాల నుంచి 60 కిలోమీటర్లు, ఆదిలాబాద్ నుంచి 100 కిలోమీటర్లు, నిర్మల్ నుంచి 80 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఆర్టీసీ బస్సుల్లో కాకుండా నేరుగా సొంత వాహనాలపై కూడా ఇక్కడికి చేరుకునే అవకాశం ఉంది. సొంత వాహనాల రాకపోకలకు రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు అనుమతి ఉండదు. అటవీశాఖ చెక్‌పోస్టుల వద్ద వాహనాలను నిలిపివేస్తారు.

ఆకట్టుకుంటున్న 'జోడేఘాట్'



కుమురంభీం స్మృతిచిహ్నాం

కెరమెరి(ఆసిఫాబాద్): భూమి, నీరు, అడవి నినాదాలతో పోరాడి అసువులు బాసిన కుమురం భీం పోరుగడ్డ జోడేఘాట్ పర్యాటకులకు ఎంతగానో ఆకట్టుకుంటోంది. సుమారు 35 ఏళ్లుగా ఆదివాసీలు జోడేఘాట్‌లో భీం వర్ధంతిని నిర్వహించి నివాళి అర్పిస్తున్నారు. 2016లో టీఆర్ఎస్ ప్రభుత్వం రూ.25 కోట్ల నిధులతో నిలువెత్తు భీం విగ్రహం, స్మృతివనం, స్మృతిచిహ్నాం, జల్, జంగల్, జమీన్‌ల ఆర్చీలను ఏర్పాటు చేసింది. సమాధి నిర్మాణం చేసింది. జోడేఘాట్ నుంచి టోకెన్‌మోవాడ్ వరకు తారు రోడ్డు, భీం మ్యూజియం నిర్మించింది. అందులో కుమురంభీం, అతని సహచరుల ప్రతిమలు, గుస్సాడీలు చేస్తున్న నృత్యాలు, ఆదివాసీ ఆభరణాలు, ఆయుధాలు, దేవతల మండపాలను ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి జోడేఘాట్ ప్రాచుర్యంలోకి వచ్చింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు వరంగల్, కరీంనగర్, ఖమ్మం, కొత్తగూడెం, ఏటూరు నాగారం, మహారాష్ట్రలోని చంద్రపూర్, రాజురా, బల్లార్షా, పాండర్‌కవడా, తదితర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు జోడేఘాట్ అందాలను ఆస్వాదిస్తున్నారు.

ఇలా వెళ్లవచ్చు..

ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్లే మార్గంలో 30 కిలోమీటర్ల దూరంలో కెరమెరికి రెండు కిలోమీటర్లు ముందుగానే హట్టి స్టాప్ ఉంటుంది. అక్కడి నుంచి జోడేఘాట్ 22 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. బస్సు సౌకర్యం లేనప్పటికీ ప్రైవేటు వాహనాలు నడుస్తాయి. ఆదిలాబాద్ నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్లే మార్గంలో కెరమెరి తర్వాత వచ్చే హట్టిలో దిగాల్సి ఉంటుంది.

నిర్మల్ జిల్లా.. పర్యాటక ఖిల్లా


బాసర సరస్వతీ మాత ఆలయం

నిర్మల్/కడెం/సారంగపూర్: నిర్మల్ జిల్లాలో అణువణువునా ప్రత్యేకతలున్న పర్యాటక, దర్శనీయ స్థలాలు ఉన్నాయి. బాసరలో గోదారి ఒడ్డున ప్రశాంత వాతావరణంలో గల కోవెలలో చదువుల తల్లి కొలువై ఉంది. ఈ అమ్మ ఒడిలోనే తమ పిల్లలకు అక్షర శ్రీకారాలు చేయిస్తుంటారు. నిర్మల్-భైంసా మీదుగా, నిజామాబాద్ మీదుగా బాసర చేరుకోవచ్చు. బస్సులతో పాటు రైల్వే సౌకర్యమూ ఉంది.

కదిలె.. పాపహరేశ్వరుడు

దిలావర్‌పూర్ మండలంలో సహ్యాద్రి పర్వతాల చివరి సానువుల్లో వెలిసిన దర్శనీయ స్థలం కదిలె. దిలావర్‌పూర్ నుంచి ఘాట్‌రోడ్డు మీదుగా వెళ్లాలి. దిలావర్‌పూర్ నుంచి 4కి.మీ దూరంలో కదిలె ఆలయం ఉంటుంది.

కొయ్యబొమ్మల ఖిల్లా..

కొయ్యబొమ్మలు, పెయింటింగ్స్ ఇక్కడి ప్రత్యేక ఆకర్షణ. నిమ్మనాయుడు కాలంలో వచ్చిన నకాశీలు ఇప్పటికీ ఈ కళను నమ్ముకుని జీవిస్తున్నారు.

'కడెం' ఒడ్డున సేదదీరాల్సిందే..

నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి 50 కి.మీ దూరంలో కడెం నదిపై ప్రాజెక్టు నిర్మించారు. పాపికొండలను తలపించే పచ్చని కొండల మధ్య ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ఉంటుంది. ఆ అందాలను ఆస్వాదించేందుకు ఇక్కడ బోటింగ్ సౌకర్యం ఉంది. ప్రాజెక్టు పక్కనే రిసార్టులు ఉన్నాయి. నిర్మల్ నుంచి 48 కి.మీ, మంచిర్యాల నుంచి 90 కి.మీ, ఆదిలాబాద్ నుంచి 100 కిలోమీటర్ల దూరం ఉంటుంది.

ప్రాణకోటికి కల్పవల్లి 'ఎల్లంపల్లి'


ఎల్లంపల్లి జలాశయం

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు 2008 జూలై 28 మంచిర్యాల-పెద్దపల్లి జిల్లాల మధ్య గోదావరిపై ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 62 గేట్లతో నిర్మాణం చేపట్టిన ప్రాజెక్ట్ దాదాపు రూ.4,950 కోట్లతో రెండేళ్ల క్రితం పూర్తి చేశారు. ప్రాజెక్ట్ కింద 1.118 కిలో మీటర్ల మేర 4 లక్షల 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ కింద రోజుకు 220 టీఎంసీల నీటిని తరలిస్తున్నారు. హాజీపూర్ మండలం ర్యాలీ గిరిజన గ్రామ శివారు అటవీ ప్రాంతంలోని జాలువారే జలపాతం పర్యాటకులకు కనువిందు చేస్తోంది.

నమోః సూర్య నారాయణ


లక్ష్మీనారాయణస్వామి ఆలయం

ఆదిలాబాద్‌టౌన్: దేశంలోనే అతి ప్రాచీన ఆలయాల్లో ఒకటైన శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయం ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండల కేంద్రంలో ఉంది. ఈ ఆలయాన్ని 11, 13వ శతాబ్దంలో జైనుల కాలంలో నిర్మించారని ప్రతీతి. ఉన్నతమైన శిఖరం కలిగి, గొప్ప శిల్పకళతో అలరారుతోంది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి 21 కిలోమీటర్ల దూరంలో ఉంది. హైదరాబాద్ నుంచి కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ మీదుగా 315 కిలోమీటర్ల దూరంలో ఉంది.

ఆలయ విశిష్టత

మహారాష్ట్రాలోని వెమత్మాలపంత్ రాతితో ఈ ఆ లయం నిర్మించారు. ఉన్నత శిఖరం కలిగి అడుగడుగునా శిల్పకళతో శోభితమైంది. 60 గజాల ఎ త్తు, 40 గజాల వైశాల్యమున్న అష్టకోణాకార మండపము పైనున్న గర్భగుడిలో సూర్యనారాయణ స్వామి విగ్రహం ప్రతిష్ఠించబడి ఉంది. మూలవిరాట్లు లక్ష్మీనారాయణ స్వామి విగ్రహానికి దక్షిణ దిశలో లక్ష్మీదేవి, హల్వారులు, అన్యదేవత మూర్తులు ఉన్నారు. ప్రతీ సంవత్సరం కార్తీక శుద్ధ ఏకదశి నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఆలయానికి ఇరువైపులా శృంగార భంగిమలతో కూడిన శిల్పఖండాలు దర్శనమిస్తాయి.

స్వామి పాదాలను తాకే భానుడి కిరణాలు..

ఏటా ఫిబ్రవరి, ఏప్రిల్, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో, దసరా అనంతరం అశ్వీయుజ పౌర్ణమిరోజు ఉదయం లక్ష్మీ నారాయణ పాదాల ను సూర్యకిరణాలు తాకుతాయి. అందుకే ఈ ఆలయాన్ని సూర్యదేవాలయంగా కూడా పిలు స్తారు. ఈ అద్భుత దృశ్యం చూడటానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు.

విహారయాత్రగా జంగల్ సఫారీ


జంగల్ సఫారీలో పర్యాటకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్ట్ పాతమంచిర్యాల అటవీ బీట్ పరిధిలోని హాజీపూర్ మండలం గఢ్‌పూర్ గ్రామ శివారు ఎంసీసీ క్వారీలోని అటవీ ప్రాంతంలో జంగల్ సఫారీ ప్రారంభించారు. మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి 5 కి.మీ దూరంలో ఉన్న ఈ సఫారీలో పాతమంచిర్యాల, తిమ్మాపూర్, బొక్కలగుట్ట అటవీబీట్ అడవులు ఉన్నాయి. 30 హెక్టార్లలో గ్రాస్‌ప్లాంట్, 30 హెక్టార్లలో అటవీ ప్రాంతం ఉంది. పర్యాటకులు అడవిఅందాలు, వన్యప్రాణులను వీక్షించేందుకు 6 మంచెలు ఏర్పాటు చేశారు. రెండున్నర గంటలపాటు 25 కిలోమీటర్ల మేర జంగల్ సఫారీ సాగుతుంది. ఆరుగురికి ఒక్కట్రిప్పుకు రూ.2,100, అదనపు వ్యక్తికి రూ.350, ట్రెక్కింగ్‌కు రూ.200లు తీసుకుంటున్నారు. ఉదయం 6:30, 9:30 గంటలకు, మధ్యాహ్నం 3:30 గంటలకు ట్రిప్పులు ఉన్నాయి.

రెచ్చగొట్టే పోస్టులుపెడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై సిగరెట్ తాగడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ, మద్యం సేవిస్తూ సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం రాత్రి పట్టణానికి చెందిన షేక్ ఇర్ఫాన్ అనే రౌడీషీటర్ సిగరేట్ తాగుతూ, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టినట్లు తెలిపారు. పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి గంజాయి పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ రావడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆదిలాబాద్ డైట్ మైదానంలోని ఎగ్జిబిషన్ వ్యాపారిని సయ్యద్ మోసిన్ అనే వ్యక్తి డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడగా అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా సోషల్ మీడియాలో, బహిరంగ ప్రదేశాల్లో కత్తులు, నిర్లక్ష్య డ్రైవింగ్, సిగరెట్ తాగుతూ రెచ్చగొట్టే పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఒకరిపై చీటింగ్ కేసు

ఆదిలాబాద్‌రూరల్: ఇచ్చోడలోని మాధపూర్‌కు చెందిన మల్లేశ్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. రాంనగర్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి వహాబొద్దీన్‌కు ఫోన్‌చేసి ఫర్నీచర్‌పై రూ.5 లక్షల స్కీమ్ ఉందని, మీ ఇంట్లో ఉన్న ఫర్నిచర్ బిల్స్‌తో రుణం వస్తుందని మాయ మాటలు చెప్పాడు. తాను ఫారెస్ట్ ఆఫీస్‌లో పనిచేస్తున్నాని చెప్పి రూ.20వేలు ఆన్‌లైన్ ద్వారా పంపించాలని చెప్పడంతో బాధితుడు రూ.18వేలు ఫోన్ ద్వారా పంపించాడు. ఆ తర్వాత ఫోన్ స్విచ్ఆఫ్ వస్తుండడంతో బాధితుడు మావల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై..

ఆదిలాబాద్‌టౌన్: పంచాయతీ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. తాంసి మండలంలోని సవర్గాంకు చెందిన గజకంటి ప్రభాకర్ పంచాయతీ కార్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్నారు. ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందడంతో పలువురు నాయకులు మంగళవారం మృతదేహంతో జిల్లా పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడంతో డీపీవో శ్రీలత ఫిర్యాదు మేరకు అనుముల కిరణ్, బొజ్జ ఆశన్న, అలాలి అజయ్, లంకా రాఘవులు, ఎ.మల్లేశ్, అగ్గిమల్ల స్వామితో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నకిలీ పత్రాల కేసులో తవ్వినకొద్దీ అక్రమాలు

సిరాజ్ అన్సారీ అనే వ్యక్తి 2025 జనవరి 16లో ఆర్‌సీ 022511735376 నంబర్‌తో మీసేవలో నివాస ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కానీ ఇదే నంబర్ మహబూబ్‌నగర్ జిల్లాలోని శేర్ వెంకటాపురం అశ్విని అనే అమ్మాయి పేరుతో జారీ అయిన ధ్రువీకరణపత్రాన్ని ఇచ్చోడ మండలంలోని ఇస్లాంనగర్ నివాసిగా సిరాజ్ అన్సారీ మార్ఫింగ్ చేశారు.

- మరో 9 మందిపై ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న మాజీ డీటీ జాదవ్ రామారావు

ఇచ్చోడ: నకిలీ నివాస ధ్రువీకరణ పత్రాల ద్వారా కొలువులు సాధించిన కేసులో తవ్విన కొద్దీ అక్రమాలు బయటకు వస్తున్నాయి. ఇతర రాష్ట్రాలకు చెందిన పలువురు ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ, ఇంద్రవెల్లి మండలాల్లో నివాసం ఉంటున్నట్లు నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి బీఎస్ఎఫ్‌లో ఉద్యోగాలు సాధించిన విషయంపై మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంతో పోలీసు, రెవెన్యూ యంత్రాగం విచారణకు రంగంలోకి దిగింది.

మరో తొమ్మిది మందిపై ఫిర్యాదు...

గతంలో ఇచ్చోడ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన జాదవ్ రామారావు (ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా పనిచేస్తున్నారు) తన డిజిటల్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఇస్లాంనగర్ గ్రామ నివాస ధ్రువీకరణ పత్రాలు మార్ఫింగ్ చేసిన అంకిత్‌పటేల్, బిపిన్‌యాదవ్, అతుల్‌కుమార్ యాదవ్, ఘనశ్యామ్ తివారి, జైనులొద్దీన్, తివారికుల్‌దీప్, అభిద్‌ఖాన్, సురాజ్‌సహని, విశ్వకర్మపై సోమవారం రాత్రి ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నకిలీ విషయంలో గోప్యత...

నకిలీ ధ్రువీకరణ పత్రాల ద్వారా ఉద్యోగాలు పొందిన 8 మంది సర్టిఫికెట్లు పరిశీలనలో నకిలీవని గుర్తించిన రెవెన్యూ అధికారులు ఈ విషయంలో గోప్యత పాటించడం పలు అనుమానాలకు తావిస్తోంది. బీఎస్ఎఫ్‌లో ఉద్యోగాలు పొందిన 8 మంది వ్యక్తుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించాలని 2025 మార్చి 8న కమాండెంట్ 53 బెటాలియన్ ఐటీబీపీ ఫోర్స్ మండలం కలికిరి, అన్నమయ్య జిల్లా అధికారులు ఆదిలాబాద్ కలెక్టర్‌ను కోరారు. సంబంధిత పత్రాలు పరిశీలించి పంపించాలని కలెక్టరేట్ అధికారులు ఇచ్చోడ తహసీల్దార్‌ను ఆదేశించారు. వాటిని పరిశీలించిన తహసీల్దార్ నకిలీ పత్రాలుగా గుర్తించారు. దీనిపై పోలీసులకుగానీ జిల్లా అధికారులకు గానీ ఫిర్యాదు చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది.

స్థానికంగా ఉండేవారి అండతోనే నివాస ధ్రువీకరణ పత్రాల మార్ఫింగ్ చేసినట్లు తెలుస్తోంది. పోలీసులు ఈ దిశగా విచారణ జరిపితే అసలు దోషులు బయటపడే అవకాశాలు ఉన్నాయని పలువురు భావిస్తున్నారు.

మహారాష్ట్ర జొన్నల పట్టివేత

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో మార్క్‌ఫెడ్ ద్వారా నిర్వహిస్తున్న జొన్నల కొనుగోలు కేంద్రంలో మంగళవారం మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన ముర్కుటే గజానంద్ 35 క్వింటాళ్ల జొన్నలను మహారాష్ట్ర నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడ అమ్మేందుకు ప్రయత్నించాడు. పీఏసీఎస్ సీఈవో నారాయణగౌడ్ అడ్డుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ముర్కుటే గజానంద్, కిన్వట్‌కు చెందిన డ్రైవర్ గుగ్గవార్ శంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశ్వర్‌రావ్ తెలిపారు. వాహనాన్ని, జొన్నలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.